క్లుప్తంగా

నేడు జన్మనక్షత్ర పూజలు

కపిలేశ్వరపురం: అంగరలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం స్వామివారి జన్మనక్షత్రమైన శ్రవణా నక్షత్ర పూజలు చేయనున్నట్టు ఆలయ నిర్వాహకులు మంగళవారం తెలిపారు. ఆలయ ప్రధాన అర్చకులు బాల బాలాజీ ఆధ్వర్యంలోని వేద పండితులు స్వామికి విశేష పూజలు చేస్తారని, భక్తులు హాజరుకావాలని వారు కోరారు.

రేపు సర్వ సభ్య సమావేశం

కె.గంగవరం: ఈ నెల 3వ తేదీన మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎన్.శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి స్థానికంగా మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఈ సమావేశం జరుగుతుందన్నారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ హాజరవుతారని అన్ని ప్రభుత్వ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు, వీఆర్ఓలు, పంచాయతీ కార్యదర్శులు పూర్తి నివేదికతో హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

సామాజిక అంశాలపై అవగాహన అవసరం



వీధివారిలంక ఎంపీపీ పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న షైనాజ్

కపిలేశ్వరపురం: విద్యార్థి దశ నుంచి సామాజిక అంశాలపై అవగాహన అవసరమని కేదారిలంక మహిళా పోలీస్ షైనాజ్ అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వీధివారిలంక గుడ్ టచ్, బ్యాడ్ టచ్, బడి బయట పరిస్థితులు, కుటుంబ పరిస్థితులు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

అసంపూర్తి పనులతో ఇక్కట్లు

మండపేట: మండపేట–ద్వారపూడి రోడ్డు అభివృద్ధి పనులు అసంపూర్తిగా నిలిపివేయడంతో రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు తీవ్ర అగచాట్లు పడాల్సి వస్తోందని మహాజన సోషలిస్ట్ పార్టీ రాష్ట్ర నాయకుడు దూలి జయరాజు అన్నారు. స్థానిక సంఘ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రోడ్డు పనులు ప్రారంభించకుంటే రాజకీయ పార్టీలతో కలిసి ప్రత్యక్ష ఆందోళన చేపడతామన్నారు. బొత్స నరసింహమూర్తి, పైడిమళ్ల సతీష్, షేక్‌నబీ, ఉండ్రాజవరపు కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలి

మండపేట: మున్సిపల్ శానిటేషన్, ఇంజినీరింగ్ విభాగాల్లో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కార్మికులు మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ కార్యదర్శి నూకల బలరాం మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. ప్రజారోగ్య పరిరక్షణకు పాటుపడుతున్న మున్సిపల్ కాంట్రాక్టు వర్కర్లను పర్మినెంట్ చేయాలన్నారు. సంఘ నాయకులు బంగారు కొండ, కొమరపు నరేంద్ర కుమార్, విజయ్, రాజు, హేమలత, అమ్ములు, వెంకటలక్ష్మి, సన్యాసమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీల్డ్ టెండర్ల ఆహ్వానం

రామచంద్రపురం రూరల్: ఏపీఎస్ఆర్టీసీ పరిధిలో ద్రాక్షారామ, కె.గంగవరం బస్‌స్టేషన్ల పరిధిలోని స్టాల్స్, షాపులు, ఖాళీ స్థలాలను వ్యాపారాలు చేసుకునే నిమిత్తం వ్యాపారస్తుల నుంచి సీల్డ్ టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు డిపో మేనేజర్ కె.వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టెండరు ఫారమ్‌లను రామచంద్రపురం డిపో మేనేజర్ కార్యాలయం నందు ఈనెల ఒకటి నుంచి 5వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంట వరకు అమ్ముతారని పేర్కొన్నారు. పూర్తి చేసిన టెండరు ఫారమ్‌లను 5వ తేదీ ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటలలోపు ద్రాక్షారామ బస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన టెండర్ బాక్సులో వేయాలని తెలిపారు. అదే రోజు మధ్యాహ్నం 3గంటలకు టెండర్ దారుల సమక్షంలో టెండర్లు తీయబడుతుందన్నారు. మరిన్ని వివరాలకు రామచంద్రపురం డిపో మేనేజర్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

పాల్కాని చెరువు సెంటర్లో బస్‌షెల్టర్ నిర్మించాలి

కాజులూరు: కాకినాడ–కోటిపల్లి రహదారిలో గొల్లపాలెంలోని పాల్కాని చెరువు సెంటర్లో బస్‌షెల్టర్ నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు. మండలంలోని 10 గ్రామాలకు కూడలి అయిన ఈ సెంటర్‌లో గొల్లపాలెం, దేగలపేట, శలపాక, తణుకువాడ, మంజేరు తదితర గ్రామాల నుంచి నిత్యం వందల సంఖ్యలో ప్రయాణికులు కాలినడకన, సైకిళ్లపైనా వచ్చి బస్సులెక్కుతుంటారు. ప్రయాణికులు బస్సుల కోసం నిరీక్షించే సమయాల్లో వీరికి సరైన షెల్టర్ సదుపాయం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్నారు. షాపుల అరుగుల పైనా దుకాణాల ఎదుట నిలిచి ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ప్రయాణికులు బస్సుల కోసం నిరీక్షించాల్సి వస్తుంది. దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ప్రయాణికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి ఈ జంక్షన్‌లో బస్‌షెల్టర్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

కౌలు రైతుకు ఎంతో మేలు

- చురుగ్గా సీసీఆర్‌సీ పత్రాల పంపిణీ
- ఈ కార్డుతో అనేక ప్రభుత్వ రాయితీలు
- డివిజన్‌లోని 6 మండలాల్లో 23,871 కార్డుల పంపిణీ



రైతుల సమావేశంలో సీసీఆర్‌సీ కార్డులపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

రామచంద్రపురం: కౌలు రైతుకు ప్రభుత్వం మేలు చేస్తుంది. అటు భూ హక్కుదారునికి ఇబ్బంది లేకుండా ఇటు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేసే రైతులకు అన్ని విధాలా సాయం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. దీంతో కౌలు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కౌలు రైతులు సీసీఆర్‌సీ (క్రాప్ కల్టివేటర్ రైట్స్) కార్డుల పంపిణీపై ఇప్పటికే గ్రామాల్లో వ్యవసాయ శాఖ రెవెన్యూ సిబ్బంది సంయుక్తంగా కౌలు రైతుల సమావేశాలు నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. ఇప్పటివరకు డివిజన్‌లో 23,871 మందికి కార్డులు పంపిణీ చేశారు.

గతంలో నిర్లక్ష్యం

గత ప్రభుత్వంలో కౌలు రైతులకు కౌలు కార్డులు మంజూరు చేసినా ఎలాంటి ప్రయోజనం ఉండేది కాదు. భూ యజమాని వస్తే తప్ప కౌలు రైతులు ఎలాంటి రాయితీలు పొందలేని పరిస్థితి ఉండేది. అలాగే పండిన ధాన్యం కూడా భూ యజమాని పేరునే అమ్ముకోవాల్సి వచ్చేది. బ్యాంకులు రుణాలు ఇచ్చేవి కావు. పంటకు నష్టం జరిగితే భూ యజమానికే పరిహారం వెళ్లేది. దీంతో కార్డులు ఇచ్చినా ప్రయోజనం ఉండేది కాదు. ఇప్పుడు పరిస్థితి మారింది.

రాయితీలు వర్తింపు

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు వచ్చాక కౌలు రైతులకు ప్రత్యేక చట్టం తీసుకువచ్చింది. దీంతో కార్డులు పొందిన ప్రతి రైతుకూ ప్రభుత్వ రాయితీలు అన్నీ వర్తించేలా చర్యలు తీసుకుంటున్నారు. భూ యజమాన్య హక్కులకు ఎలాంటి భంగం వాటిల్లకుండా పంట సాగు చేస్తున్న కౌలు రైతుకు అన్ని రాయితీలు వర్తించేలా సీసీఆర్‌సీ (పంట సాగు పత్రాలు) అందిస్తోంది. వీటితో వ్యయసాయ శాఖ ద్వారా వచ్చే పథకాలు అన్ని కౌలు రైతులకు వర్తింప చేస్తుంది. అన్ని రాయితీలు నేరుగా అందిస్తుంది. దీంతో కౌలు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి అన్ని ప్రయోజనాలు పొందుతున్నారు.

మండలం	గ్రామాలు	లక్ష్యం	ఇచ్చిన మొత్తం కార్డులు	ఇవ్వాల్సినవి
రామచంద్రపురం	22	4101	3874	227
కె.గంగవరం	25	3296	2786	510
కపిలేశ్వరపురం	15	4926	4144	782
మండపేట	14	5314	4789	525
రాయవరం	10	4955	4316	639
కాజులూరు	24	4256	3962	294

అందుతున్న రైతు భరోసా..

రైతులకు వ్యవసాయం చేయడానికి పెట్టుబడిగా ఉండేందుకు వీలుగా ప్రభుత్వం ఏటా ఇస్తున్న రైతు భరోసా పథకం కౌలు రైతులకు అందిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే రూ.7500లతో పాటుగా పీఎం కిసాన్ ద్వారా కూడా కేంద్రం వేసే రూ.6 వేలు కూడా కౌలు రైతులకు అందుతుంది. ఇదంతా రాష్ట్ర ప్రభుత్వం తీసుకన్న చొరవతోనే అని కౌలు రైతులంటున్నారు.

ప్రయోజనాలెన్నో..



కౌలు రైతులకు ఇచ్చే పంటసాగు పత్రాలు(సీసీఆర్‌సీ) వల్ల ఎన్నో ప్రయోజనాలున్నాయి. 11 నెలల కాలానికి ఈ పత్రం కాలపరిమితి వర్తిస్తుంది. ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని రాయితీలు దీని ద్వారా పొందవచ్చు. భూ హక్కుదారునకు ఎలాంటి ఇబ్బందులు కలగవు. దీనిని రైతులు గమనించాలి.

– సత్యప్రసాద్, ఏవో, రామచంద్రపురం

ప్రభుత్వం చొరవతో మంచి సౌకర్యాలు



కౌలు హక్కు పత్రాల ద్వారా కౌలు రైతులకు రైతు భరోసా కల్పిస్తున్నారు. మిగిలిన ప్రయోజనాలు కూడా వస్తున్నాయి. ఇదంతా రాష్ట్ర ప్రభుత్వం చొరవ కారణంగా జరుగుతుంది. గత ప్రభుత్వంలో రైతు కార్డులు ఇచ్చినా ఎలాంటి ప్రయోజనం ఉండేది కాదు.

– పలివెల వెంకన్న, కౌలు రైతు, దంగేరు

ఆస్పత్రికి వెళ్లి.. పింఛను అందించి..



పింఛను అందిస్తున్న వలంటీర్ యశ్వంత్, వైఎస్సార్ సీపీ నాయకులు

మండపేట: ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కిడ్నీ వ్యాధిగ్రస్తురాలి వద్దకు వెళ్లి పింఛను అందజేసి తన సేవాభావాన్ని చాటుకున్నాడు మండలంలోని కేశవరానికి చెందిన వలంటీర్ చేబోలు కుశ్వంత్. గ్రామానికి చెందిన బిళ్ల దమయంతి కిడ్నీ వ్యాధితో రాజానగరం జీఎస్ఎల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆమెకు పింఛన్‌గా ప్రభుత్వం రూ.10 వేలు సాయం అందిస్తోంది. ఆమె తీసుకునేందుకు రాలేని పరిస్థితుల్లో ఉండడంతో వలంటీర్ కుశ్వంత్, వార్డు సభ్యులు చేబోలు సత్తిబాబు, అల్లంపల్లి కిషోర్, సచివాలయ కన్వీనర్ విన్నకోట ప్రసాద్ ఆస్పత్రికి వెళ్లి అందించారు. ఈ సందర్భంగా వారిని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ దూలం పద్మ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వెంకన్నబాబు దంపతులు అభినందించారు.

తగ్గిన గోదావరి ఉధృతి



కోటిపల్లి ఫెర్రీలో బురదమయంగా మారిన పుష్కరఘాట్లు

కె.గంగవరం: ఉగ్రరూపం దాల్చిన గోదావరి మంగళవారం ఉదయం నుంచి పూర్తి స్థాయిలో తగ్గుముఖం పట్టింది. సోమవారంతో పోలిస్తే ఐదడుగుల మేర వరద ఉధృతి తగ్గిందని రెవెన్యూ సిబ్బంది తెలిపారు. వరద ఉధృతి తగ్గుతుండడంతో గోదావరి పరీవాహక ప్రజలు, ముంపు గ్రామ ప్రజలు కొంత వరకు ఉపశమనం పొందారు. కోటిపల్లి రేవులోని ఫెర్రీ వద్ద పుష్కర ఘాట్‌ల మధ్యలో వరకు ప్రస్తుతం వరదనీరు ప్రవహిస్తుంది. దీంతో పైనున్న పుష్కరఘాట్‌ల మెట్లు అడుగు మేర బురదగా మారాయి. మత్స్యకార కాలనీలోని మూడు పేటల్లో వరదనీరు తగ్గడంతో ఇళ్లను ప్రజలు శుభ్రం చేసుకుంటున్నారు. గోదావరి ఉధృతి తగ్గినా అటుపై గల రహదారి కొట్టుకుపోవడం వల్ల పంటు ప్రయాణాన్ని రెవెన్యూ, పోలీసు అధికారులు నిలిపివేశారు. పూర్తి స్థాయిలో వరదనీరు తగ్గిన తరువాతే పంటు ప్రయాణానికి అనుమతిస్తామని వారు తెలిపారు. పంచాయతీకి చెందిన పారిశుద్ధ్య కార్మికులు యుద్ధప్రాతిపదికన రేవులో పుష్కర మెట్ల వద్ద ఉన్న బురదను తొలగిస్తున్నారు. దీంతో పాటు పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ ఆధ్వర్యంలో రేవుతో పాటు మత్స్యకార కాలనీలో పారిశుద్ధ్యం మెరుగుపరిచేందుకు అన్ని చర్యలు తీసుకుకుంటున్నారు. దోమల నివారణకు ఎబేట్ మందును కాలనీల వద్ద స్ప్రే చేయించారు.

పేదలకు భరోసానిచ్చే ప్రభుత్వం



ఆదివారపుపేటలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి వేణు



ఆదివారపుపేటలో చరఖాను పట్టి నేత నేస్తున్న మంత్రి వేణు

రామచంద్రపురం రూరల్: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 98 శాతం నెరవేర్చి ప్రజలకు భరోసాను కల్పించిన సీఎం జగన్ నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. మండలంలోని ఆదివారపుపేటలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం మంత్రి వేణు నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి లబ్ధిదారులు ప్రభుత్వం ద్వారా పొందిన పథకాల లబ్ధ/ ని వివరించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మంత్రి మాట్లాడుతూ పరిపాలనలో ఎన్నో వ్యవస్థలున్నప్పటికీ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు మెరుగైన పారదర్శక పాలన అందుతుందన్నారు. సీఎం జగన్ అన్ని వర్గాలకు లబ్ధి చేకూరే విధంగా గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను రూపొందించారని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, అవినీతి లేని పాలనే ప్రభుత్వ లక్ష్యం అని మంత్రి వేణు అన్నారు. ప్రతి ఇంటికీ ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు చేరాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం పని చేస్తుందని వివరించారు. స్థానికంగా ఉన్న ప్రజలు తమ సమస్యలను మంత్రికి విన్నవించారు. అందులో భాగంగా డ్రైనేజీ సమస్యలతో పాటు రోడ్డు సమస్య, విద్యుత్ లైట్లు, తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను మంత్రి వేణు ఆదేశించారు. చేనేత కార్మికుని ఇంటి వద్ద చరఖా చేత బట్టి స్వయంగా మంత్రి వేణు నేత నేశారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎంపీపీ అంబటి భవాని, సర్పంచ్ దొరబాబు, ఎంపీటీసీ సుధాకరరావు, ఎంపీడీవో రాజు, తహసీల్దార్ తేజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఓటర్ల జాబితా సర్వే



టేకి గ్రామస్తులతో ఓటు హక్కుపై మాట్లాడుతున్న తహసీల్దార్

కపిలేశ్వరపురం: గ్రామాల్లో మంగళవారం ఓటు వెరిఫికేషన్ సర్వే జరిగింది. తహసీల్దార్ కొమరం సూర్యారావు పర్యవేక్షణలోని రెవెన్యూ సిబ్బంది, బూత్‌లెవెల్ ఆఫీసర్లు ఇంటింటికీ వెళ్లి సర్వే చేశారు. అంగర, టేకి, మాచర తదితర గ్రామాల్లో కార్యక్రమాన్ని తహసీల్దార్ పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఓటు హక్కు ఉన్న వారు నివాస పరిస్థితులు, వలస వెళ్లడం, 18 ఏళ్ల నిండిన వారికి ఓటు హక్కు కల్పించడం, ఓటరు జాబితాలో పేర్లు నమోదు, తొలగింపు, మార్పులు తదితర అంశాల వారీగా సర్వే సాగింది. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరికీ కల్పించాలన్న లక్ష్యంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేక కార్యక్రమం చేపట్టినట్టు తహసీల్దార్ సూర్యారావు తెలిపారు.

పీఠంలో అధిక శ్రావణ పౌర్ణమి పూజలు



ప్రత్యేక అలంకరణలో విజయదుర్గా అమ్మవారు

రాయవరం: వెదురుపాక విజయదుర్గా పీఠంలో మంగళవారం అధిక శ్రావణ పౌర్ణమి పూజలు నిర్వహించారు. పౌర్ణమిని పురస్కరించుకుని పీఠంలో విజయదుర్గా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పీఠంలో పూజలు చేశారు. పీఠానికి హాజరైన భక్తులకు పీఠం పీఆర్వో వాడ్రేవు వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఘనంగా అన్నసమారాధన నిర్వహించారు.

మడికిలో అగ్నిప్రమాదం

ఆలమూరు: మండలంలోని మడికిలో జరిగిన అగ్ని ప్రమాదంలో యార్లగడ్డ యోహాన్ కుటుంబ సభ్యులు సర్వస్వం కోల్పోయి నిరాశ్రయులయ్యారు. స్థానిక ఎస్సీకాలనీలోని రేకులషెడ్‌లో భార్య నాగమణి వంట చేస్తుండగా సిలిండర్ వద్ద గ్యాస్ లీకై అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో భయాందోళన చెందిన సుమారు 15 మంది ఉమ్మడి కుటుంబసభ్యులు బయటకు పరుగులు తీశారు. ప్రమాద విషయం తెలుసుకున్న సర్పంచ్ లక్ష్మీమానిక మండపేట అగ్నిమాపక దళ సిబ్బందికి సమాచారం అందించారు. ఆ వాహనం వచ్చే లోపే ఇంట్లో ఉన్న గృహోపకరణాలు, వంట పాత్రలు, దుస్తులు కాలి బూడిదయ్యాయి.

సుబ్బారావు సేవలు ఆదర్శం

ఆలమూరు: గ్రామంలోని 33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో రూరల్ లైన్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన టేకి వెంకట సుబ్బారావు సేవలు ఆదర్శనీయమని ట్రాన్స్‌కో రామచంద్రపురం డీఈ వై.విజయానంద అన్నారు. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో సోమవారం రాత్రి లైన్ ఇన్‌స్పెక్టర్ వెంకట సుబ్బారావు ఉద్యోగ విరమణ సభ జరిగింది. విధి నిర్వహణలో ఆయన ప్రజలకు అందించిన సేవలను పలువురు వక్తలు కొనియాడారు. అనంతరం లైన్ ఇన్‌స్పెక్టర్ వెంకట సుబ్బారావును స్థానికులు, విద్యుత్ శాఖ ఉద్యోగులు ఘనంగా సత్కరించి మెమెంటోను బహూకరించారు.

విద్యా బ్యాంకు సేవలు ప్రారంభం

రావులపాలెం: రావులపాడులో పేద చిన్నారుల విద్యాభివృద్ధికి, విద్యాసామగ్రి పంపిణీ చేయడానికి విద్యా బ్యాంకు ప్రారంభించినట్టు శ్యామ్ మంగళవా రం తెలిపారు. ఈ బ్యాంకు ద్వారా సంపన్నుల వద్ద నుంచి పుస్తకాలు స్టేషనరీ రూపంలో డిపాజిట్ చేయించుకుని వాటిని పేద చిన్నారులకు పంపిణీ చేస్తామని శ్యామ్ చెప్పారు. రావులపాడు గుడారాల్లో నివసిస్తున్న 50 మంది వలస కూలీల చిన్నారులకు, భిక్షాటన చేసుకునే చిన్నారులకు పుస్తకాలు, పెన్ను లు, స్టేషనరీలను శ్యామ్ ఫ్యామిలీ పంపిణీ చేసింది.

రైతుల సంక్షేమానికి కృషి చేయాలి



ఎమ్మెల్సీ తోటను కలిసిన కేశవరం పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ సభ్యులు

మండపేట: రైతుల సంక్షేమానికి, సొసైటీ అభివృద్ధికి త్రిసభ్య కమిటీ కృషి చేయాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సూచించారు. మండలంలోని కేశవరం పీఏసీఎస్‌కు నూతనంగా నియమితులైన త్రిసభ్య కమిటీ చైర్మన్ ముక్కపాటి శ్రీనివాస్, డైరెక్టర్లు చెబోలు పోసిబాబు, చంద్రమాళ్ల యాసయ్య మంగళవారం రాత్రి పార్టీ రాష్ట్ర నేతలు రెడ్డి రాజుబాబు, దూలం వెంకన్నబాబులతో కలిసి స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీ తోటను మర్యాద పూర్వకంగా కలిశారు. తమ నియామకంపై ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తోట వారిని అభినందించి వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసు కుని రైతుల ప్రయోజనాల కోసం పాటుపడాలని సూచించారు. పార్టీ నాయకులు మన్నే భూషణం, అల్లంపల్లి కిశోర్, అద్దంకి రమణ, సలాది శివ, పరిమి శ్రీను, చెబోలు సత్తిబాబు, చెబోలు పోసిబాబు పాల్గొన్నారు.

అంధ దంపతుల ఔదార్యం



పాశర్లపూడిలో వరద బాధితులకు కూరగాయలు అందజేస్తున్న తహసీల్దార్ వెంకటేశ్వరి

మామిడికుదురు: పాశర్లపూడి, పాశర్లపూడిలంక గ్రామాలకు చెందిన వరద బాధితులపై కాకినాడకు చెందిన అంధ దంపతులు ఔదార్యం చూపారు. పై రెండు గ్రామాలకు చెందిన 200 మంది బాధితులకు కాకినాడకు చెందిన దాట్ల సత్యనారాయణరాజు, విజయకుమారి దంపతులు మంగళవారం కూరగాయలు పంపిణీ చేశారు. వీటిని ఇన్‌చార్జ్ తహసీల్దార్ జె.వెంకటేశ్వరి చేతుల మీదుగా బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ అంధులైన సత్యనారాయణరాజు, విజయకుమారి దంపతులు ఎంతో ఉదారంగా వరద బాధితులకు సహాయం అందించడం ముదావహమన్నారు. దాతలు వీరిని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఈ అంధ దంపతులు సేవలు నిర్వహిస్తారని చెప్పారు. సత్యనారాయణరాజు దంపతులకు ఆమె అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కొనుకు ప్రేమజ్యోతి, తెలగారెడ్డి సూర్యప్రకాశరావు, ఎంపీటీసీ అంకాని వీరాంజనేయులు, పాశర్లపూడి సత్రం చైర్మన్ వాసంశెట్టి రామకృష్ణ, మాజీ సర్పంచ్ కొనుకు నాగరాజు, కుమారి, బూరమ్మ, బీర చిన్న, రాజు పాల్గొన్నారు.

నారుమడులు మునగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



జగన్నాథగిరిలో పంట పొలాలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తల బృందం

కాజులూరు: జిల్లాలో కురుస్తున్న వర్షాలకు నారుమడులు, వెదజల్లిన పొలాల్లో వర్షపునీరు నిల్వ ఉండకుండా రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఏరువాక శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.బాలాజీనాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని గొల్లపాలెం, శలపాక, ఆర్యావటం, జగన్నాథగిరి తదితర గ్రామాల్లో కరప ఏడీఏ కె.బాబురావు ఆధ్వర్యంలో శాస్త్రవేత్తల బృందం పర్యటించి నీటమునిగిన నారుమడుల సస్యరక్షణ చర్యలపై రైతులకు పలు సూచనలు చేశారు. జగన్నాథగిరిలో ఏరువాక శాస్త్రవేత్త డాక్టర్ బాలాజీనాయక్ మాట్లాడుతూ మండల గ్రామాల్లో వెదజల్లు, నారుమడుల దశ కొనసాగుతుందన్నారు. తడి, తడిగా ఉండే బురద పదునులో వరిమొక్క మొలకెత్తుతుందని అయితే గత వారం, పది రోజులుగా ప్రతి రోజూ ఏదో ఒక సమయంలో చెదురు మదురుగా, భారీగా వర్షాలు పడుతూ ఉండటంతో ఇప్పుడిప్పుడే వేసిన వరి నాట్లు, నారుమడులు, వెదజల్లిన పొలాలు ముంపు నీటిలో నానుతుండటంతో మొలకశాతం తగ్గిపోతుందన్నారు. పొలాల్లోని వర్షపునీరు ఎప్పటికప్పుడు బయటకు వెళ్లకపోతే మొలకెత్తిన నారు కూడా దెబ్బతింటుందని, నారుమడి సక్రమంగా మొలవకపోతే వరినారు కొరత ఏర్పడుతుందన్నారు. మునిగిపోయిన నారుమళ్లలో నుంచి ముంపునీటిని రైతులు బయటికి తరలించి నష్టనివారణకు ఐదు సెంట్ల నారుమడికి ఒక కిలో యూరియా, ఒక కిలో మ్యూరేట్ ఆఫ్ పొటాష్ చల్లుకోవాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ ఎంవీ కృష్ణాజీ, డాక్టర్ పి.భరత్‌చంద్ర, వ్యవసాయాధికారులు వి.అశోక్, పి.మాధవి, తదితరులు పాల్గొన్నారు.

గడ్డి లాగుతుండగా కాటేసిన పాము

అయినవిల్లి: మండలంలోని వీరవల్లిపాలేనికి చెందిన మేడిశెట్టి నాగబ్రహ్మాజీరావు పశువులకు గడ్డిమేటు నుంచి గడ్డి లాగుతుండగా అతడి కాలుపై గడ్డిమేటులో ఉన్న తాచుపాము కాటేసింది. వరదలకు వచ్చి గడ్డిమేటులో దాగిన పాము నాగ బ్రహ్మాజీరావుని కాటేసింది. ఇతడిని స్థానిక రైతులు వీరవల్లిపాలెం పీహెచ్‌సీకి తరలించారు. వైద్యుడు ఎస్.సునీల్ ప్రాథమిక వైద్యం అందించి మెరుగైన చికిత్స కోసం అమలాపురం ఏరియా ఆసుపత్రికి అక్కడి నుంచి ఉన్నత వైద్యం కోసం కిమ్స్ ఆస్పత్రికి తరలించారు.

వరదనీరు తగ్గాకే పంటల సస్యరక్షణ

కొత్తపేట: గోదావరి వరద ప్రభావిత లంక భూముల్లో వరద నీరు తగ్గిన వెంటనే తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టి పంటలను కాపాడుకోవాలని స్థానిక ఉద్యాన అధికారి (హెచ్ఓ) గంటా కోటేశ్వరరావు రైతులకు సూచించారు. స్థానిక ఉద్యాన శాఖ సబ్ డివిజన్ పరిధిలోని కొత్తపేట, రావులపాలెం, ఆత్రేయపురం, ఆలమూరు, కపిలేశ్వరపురం మండలాల్లో ఆర్బీకేల ద్వారా క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న గ్రామ ఉద్యాన, వ్యవసాయ సహాయకులతో మంగళవారం హెచ్ఓ కోటేశ్వరరావు సమీక్షించారు. వరద నీరు తగ్గిన వెంటనే ఆయా రైతులు ఉద్యాన అధికారుల సూచనలు, సలహాలు పాటిస్తూ ఆయా పంటలను సంరక్షించుకోవాలన్నారు.

కుట్టు శిక్షణతో ఆర్థిక స్వావలంబన

అంబాజీపేట: కుట్టుమెషీన్లపై మహిళలకు ఇస్తున్న శిక్షణ ద్వారా ఆర్థిక స్వావలంబనకు ఎంతో దోహదపడుతుందని రాజమహేంద్రవరం స్వర్ణా సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఫౌండర్ పి.స్వర్ణలత, సీఆర్పీ ఫోర్స్ ఇండియా ఫౌండర్ జి.పాల్‌ప్రసాద్ అన్నారు. గంగలకుర్రు పెదగరువులో సర్పంచ్ కాండ్రేగుల శ్రీనివాసరావు అధ్యక్షతన స్వర్ణ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్, సీఆర్పీ ఫోర్స్ ఇండియా ఆధ్వర్యంలో 100 మంది మహిళలకు, యువతికి కుట్టుమెషీన్లను మంగళవారం పంపిణీ చేశారు. మండలంలోని 8 గ్రామాల్లో టైలరింగ్, కుట్టుమెషీన్‌లపై శిక్షణ పొందిన 200 మందికి గాను 100 మందికి ధ్రువీకరణ పత్రాలు, కుట్టు మెషీన్లను పంపిణీ చేశామన్నారు. మిగిలిన వారికి త్వరలో అందజేస్తామన్నారు.

వ్యక్తి మృతదేహం లభ్యం

రామచంద్రపురం రూరల్: మండలంలోని తాడిపల్లి పంట కాలువలో గుర్తుతెలియని పురుషుని మృతదేహాన్ని మంగళవారం స్థానికులు గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మృతుడి వయసు 35–40 సంవత్సరాలు ఉంటుందని, నీలం రంగు జీన్‌ఫ్యాంటు, గోధుమరంగు గడుల షర్టుతో ఉన్నాడని తెలిపారు. తాడిపల్లి వీఆర్వో ఎం.శ్రావణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ద్రాక్షారామ ఎస్సై బి.వినోద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.